# జమీన్ రైతు

బులిటీన్

7-7-47 సోమవారం నెల్లూరు వెల 0-0-3

# హిందూ—ముస్లిం గలాటా

## గత 45 గం॥లుగా ఏ ఘర్షణలు లేవు

### యీ దినం

యీదినం పరిస్థితులు శాంతంగా వున్నవి. గత 45 గంటలుగా ఏ కొట్లాటలున్నూ జరుగలేదు.

బజార్లలో చాలాభాగం అంగళ్ళన్నీ తీయబడినవి. భయంలేకుండా పౌరులు సంచరిస్తున్నారు. వ్యాపార వ్యవహారాలన్నీ చాలాభాగం యధావిధిగా జరిగిపోతున్నవి.

### బొంబాయి సేటు మరణం

3 తేదీ రాత్రి బొంబాయి ప్రాంత వర్తకుడు అబ్దుల్లాను హత్యచేయడానికి కారణమేమి? అతను రైల్వేస్టేషన్‌రోడ్డునుంచి వస్తుండగా ధనంకోసమే మధ్యలో పొడవబడ్డాడనీ, అక్కడినుండి వస్తూ పోతూ బయటకమ్మరి అంగళ్ళవద్ద పడిపోయాడనీ అతన్ని వెంటాడుతున్న వ్యక్తులు మనుష్యుల సందడిచూచి వెళ్లిపోయివుంటారని వదంతిగావుంది. ఏదియెట్లున్నా యిది మతకలహానికి సంబంధించనట్లు మాత్రం ఊహించతగివున్నది.

చనిపోయిన షేక్ అబ్దుల్లాతోగూడా అతని గుమాస్తా మహమ్మద్ వహాబ్, అతనిఅల్లుడు అబ్దుల్ లతీఫ్, మరి 4 గురు వ్యాపారస్తులు వచ్చారు. వీరంతా యింకా నెల్లూరులోనే వున్నారు.

### పోలీసు బందోబస్తు

యితరచోట్లనుంచి పోలీసురిజర్వు రప్పించబడ్డది. అన్నిచోట్లా తగినబందోబస్తు చేయబడ్డది.

### అధికార్లు

సర్కిల్, డిప్టీసూపరెంట్, జిల్లాసూపరెంట్ మున్నగు పోలీసు ఉద్యోగస్థులున్నూ, నారాయణరావు సబ్‌మేజిస్ట్రేటు మొదలు కలెక్టరు జోసఫురెడ్డిగారివరకూ మెజిస్టీరియల్ అధికార్లున్నూ వెయ్యికండ్లతో జాగ్రత కలిగివున్నారు. నారాయణరావు జీపుకారు ప్రతినిమిషము ఏ వీధిలో చూస్తే ఆవీధిలో దర్శనమిస్తూ ప్రజలకు భయంలేకుండా చేస్తున్నది.

### బస్ సర్వీస్

నిన్న మధ్యాహ్నంనుంచి రెండు బస్సులున్నూ టౌనులో తిరుగుతూ ప్రయాణీకులను దాటవేస్తున్నవి. గతరాత్రి రైలుప్రయాణీకులకుగూడా ఉపకరించినవి.

### కల్లు-సారాయి మహాత్త

6 తేదీ పత్రికా విలేఖరుల సమావేశంలో జిల్లా అధికార్లతో గలాటా తగ్గేదాకా పగలుగూడా కల్లు-సారాయి దుకాణాలు బందుచేయించమని విలేఖరులు కోరారు. అందుకు అధికార్లు సుముఖతచూపినారు.

## అజాద్‌పోజ్

పై సేనాదళంవారు 40 మంది రైలుస్టేషనులోవుండి ప్రయాణీకులకు సర్వసౌకర్యాలు సమకూరుస్తున్నారు.

## రిమేండులో

నిన్న జామీనుమీద విడుదలకాబడిన 16 మంది గాక, పులిం కృష్ణారెడ్డి - అగ్బర్ యీయిద్దరు మాత్రము రిమాండులో వున్నారు.

కాపువీధి. కె. రత్నాన్ని యీదినం దీసుకవచ్చారు. పోలీసుకస్టడీలో వున్నారు.

## లైట్లు

కాలేజి - కోర్టుల మధ్య చాలాలైట్లు వెలగడంలేదు. తక్షణం సరిచేయవలెను.

## ఆసుపత్రిలో

ఆసుపత్రిలో వున్నవారికి నిమ్మళంగావుంది. మస్తాన్ విషయంగూడా ప్రమాదంలేదన్నాడు డాక్టరు

## సినిమాలు

కొత్తహాలు బంద్ అయింది. వినాయక్‌లో రాజాగారి "గొల్లభామ" ధైర్యంగా పగలు 3 గం॥నుండి 6 గం॥ వరకు నటిస్తున్నది.

## స్కూళ్ళు

స్కూళ్లు - కాలేజీ అన్నీ మామూలుగానే నడుస్తున్నవి.

## పోలీసులరాక

నెల్లూరు బస్తీవారుగాక, జిల్లా పలుప్రాంతాల

| | |
|---|---|
| నుండి వచ్చినవారు | 50 |
| నార్తుఆర్కాటు | 64 |
| కాకినాడ | 52 |
| ప. గోదావరి | 48 |
| కుల్లు | 214 |

## వ్యాఖ్యలు

రైల్వేవర్కర్లతో ప్రారంభమైన కొట్లాట మతకలహంక్రిందికి మారింది. వ్యక్తిగతాలుగా వచ్చేమనస్పర్థంవల్ల వేలకొలది ప్రజలు బాధపడడం ఒప్పుకోతగింది కాదు.

ఇప్పటికైనా మళ్లీ యీపుండు రేగకుండా వుండాలంటే తాత్కాలికంగానైనా యీ. బి. యస్. షెడ్డు మరొకచోటికి మార్చడం అత్యవసరం.

• • •

నెల్లూరు బస్‌సర్వీసును వెంటనే జాతీయంచెయ్యడంకావి, అంతవరకూ యిప్పుడు కోరివున్న ప్రకారము రాకపోకలుంచేవాళ్ళకు కొన్నిబస్సురూట్లు యివ్వడంకానీ యిట్టితకరార్లు రాకుండా చెయ్యడానికి వుపకరించవచ్చును.

• • •

తిరుగా హిందూ ముస్లింనాయకుల శాంతి సమావేశం రేపటిరోజు జరుగబోతున్నది అన్నివిషయాలతోపాటు యీదఫా ప్రారంభమైన మతఘర్షణకు నిజమైన కారణాలు తెలుసుకొనుటకు ఒక నిష్పాక్షిక మధ్యవర్తిని వెయ్యడంకూడా అవసరం.

• • •

పరిస్థితులు పోలీసువశం తప్పినట్లు 6 తేది ఆంధ్రపత్రికలో నెల్లూరువిలేఖరి పంపిన భయవిహ్వలమైన ఒకవార్త కనిపించింది. యిదిపచ్చిఅబద్ధం.

• • •

ప్రతిభాన్వితమైన అంతపెద్ద బస్తీపోలీసుస్టేషనుకు దక్షిణంగా 50 గజాలదూరంలో పట్టపగలు ఒకర్ని పొడవడం. ఉత్తరంగా 50 గజాల్లో మరొకరిని పొడవడం చూస్తే - పోలీసుస్టేషను ప్రఖ్యాతిని పొగిడేదానికంటే, దుండగీండ్రధైర్యాన్ని అభినందించడమే మాకు సమంజసంగా కనిపిస్తున్నది. మీరేమంటారు?

## రేపు బులిటన్ రాదు

అనవసరమైన వదంతులు ప్రబలుతున్నందున యీ గలాటాదినాల్లో యథార్థవార్తలను ప్రజలకు అందించే నిమిత్తం నిన్న. యీదినం బులిటనులు ప్రకటించినాము. 5 తేది సా॥ 7 గం॥లనుండి యీదినం (7 తేది) సా॥ 5 గం॥ల వరకు ఏ విధమైన దుండగాలు జరుగలేదు. ఇక శాంతించవచ్చును. కావున రేపటిరోజు బులిటన్ ప్రకటించబడదు.

జమీన్‌రైతు ముద్రణాలయంలో, నెల్లూరు వెంకట్రామానాయుడుచే ప్రకటించబడినది, నెల్లూరు.